

# పేరూరులో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి

**హాలియా,సెప్టెంబర్7 (ప్రజా జ్యోతి)**

గత రిజర్వేషన్ల ప్రకారం పేరూరు గ్రామంలో ఎస్టీ జనాభా లేకపోవడంతో నిలిచిపోయిన గ్రామపంచాయతీ ఎన్నికలను వెంటనే నిర్వహించాలని, గ్రామాభివృద్ధిని కాపాడాలని కోరుతూ మాజీ సర్పంచ్ సలహాదారు నాగరాజు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అనుముల ఎంపీడీవో ఎండీ. మజీద్‌కు వినతిపత్రం అందజేశారు.

వివరాలు 2లో

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
నల్గొండ
సూర్యాపేట - యాదాద్రి భువనగిరి
మంగళవారం 08 సెప్టెంబర్ 2026 పేజీలు:16





# సెప్టెంబర్ 19న కోదాడలో మెగా జాబ్ మేళా

- నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు నిరంతర కృషి అవసరం
- రాష్ట్ర నీటిపారుదల,ఆహార,పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 07(ప్రజా జ్యోతి):**

నిరుద్యోగం సమాజం ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యల్లో ఒకటని,విద్యావంతులైన యువతకు వారి విద్యార్హతలు,నైపుణ్యాలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రైవేట్ సంస్థలు,నైపుణ్యాభివృద్ధి సంస్థలు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర నీటి పారుదల,ఆహార,పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

మిగతా 2 లో

# ఎస్ఐఆర్‌లో అనామలీస్,నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు

- పకడ్బందీగా విచారణ చేపట్టాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి - సి.సుదర్శన్ రెడ్డి



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 07(ప్రజా జ్యోతి):**

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించి, నిబంధనల ప్రకారం పకడ్బందీగా విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ప్రతి ఓటరుకు నోటీసు అందేలా చర్యలు తీసుకోవాలని, విచారణ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో సి. సుదర్శన్ రెడ్డి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసుల జారీ, పంపిణీతో పాటు విచారణ ప్రక్రియపై జిల్లాల వారీగా సమీక్షించారు.

మిగతా 2 లో

# సెప్టెంబర్ 19న కోదాడలో మెగా జాబ్ మేళా



మొదటిపేజీ తరువాయి

నిరుద్యోగ సమస్య ఒక్కరోజులో లేదా ఒక్క జాబ్ మేళాతో పరిష్కారం కాదని,యువతను నియామక సంస్థలతో నేరుగా అనుసంధానం చేస్తూ నిరంతరం ప్రణాళికాబద్ధమైన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు.తన 32 ఏళ్ల ప్రజాజీవితంలో ఎమ్మెల్యేగా,ఎంపీగా,మంత్రిగా,టీపీసీసీ అధ్యక్షుడిగా సాధ్యమైనంతమంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేశానని,భవిష్యత్తులోనూ ఈ ప్రయత్నాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు.

### 19న ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు

కోదాడ పట్టణంలోని సి.సి. రెడ్డి కాన్వెంట్ స్కూల్‌లో సెప్టెంబర్ 19న శనివారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమల శాఖ, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధుల ద్వారా అందించనుందని చెప్పారు.

### హుజూర్‌నగర్ జాబ్ మేళాకు భారీ స్పందన

2025 అక్టోబర్‌లో నిర్వహించిన హుజూర్‌నగర్ మెగా జాబ్ మేళాకు దాదాపు 40 వేల మంది నమోదు చేసుకోగా, 20,463 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని మంత్రి తెలిపారు. వీరిలో 2,041 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని, మరో 1,533 మంది తదుపరి నియామకాల కోసం షార్ట్‌లిస్ట్ అయ్యారని పేర్కొన్నారు. మొత్తంగా 3,574 మంది యువతకు ప్రత్యక్షంగా లేదా భవిష్యత్తులో ఉపాధి పొందే అవకాశం లభించిందన్నారు.

### ప్రత్యేక కమిటీ ఏర్పాటు

కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతి రెడ్డి కన్వీనర్‌గా జాబ్ మేళా నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. నల్గొండ ఎంపీ కె. రఘువీర్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ, కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ, వైస్ చైర్‌పర్సన్ మల్లేశ్వరి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కోటేశ్వరరావుతో పాటు పరిశ్రమల శాఖ, సింగరేణి సంస్థ ప్రతినిధులు కమిటీలో సభ్యులుగా ఉంటారని తెలిపారు.అభ్యర్థుల నమోదు, కంపెనీల భాగస్వామ్యం, ప్రచారం, ఇంటర్వ్యూ సదుపాయాలు, రవాణా, భద్రత, ఆహారం, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను కమిటీ సమన్వయం చేయనుందని చెప్పారు. కార్యక్రమం తేదీ సమీపించే నాటికి మరికొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులను కమిటీలో చేర్చనున్నట్లు తెలిపారు.నిర్వహణ కమిటీ తొలి సమావేశం సెప్టెంబర్ 10న సాయంత్రం 5 గంటలకు సచివాలయంలో నిర్వహించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

# ఎస్ఐఆర్‌లో అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు

మొదటిపేజీ తరువాయి

సూర్యాపేట సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు పంపిణీ చేయాలని ఆదేశించారు.నోటీసులు అందుకున్న ఓటర్లకు తమ వివరాలను సమర్పించుకునేందుకు,విచారణలో తమ వాదన వినిపించేందుకు పూర్తి అవకాశం కల్పించాలని సూచించారు. అనంతరం అందిన వివరాలను నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు.విచారణ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు







తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన ఓటర్ల హక్కులను పరిరక్షిస్తూ, ఎస్ఐఆర్‌లో గుర్తించిన అనామలీస్, నో మ్యాపింగ్ అంశాలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని తెలిపారు.జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు విచారణ ప్రక్రియ కొనసాగుతోందని, నిర్ణీత గడువులోగా విచారణను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్వో ప్రేమ్ రాజ్, ఆర్డీవోలు, సంబంధిత ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేరూరులో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పంచాయతీకి ప్రత్యేక హోదా కల్పించి వీలైనంత త్వరగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.ఎన్నికలు జరగకపోవడం వలన గ్రామాభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని,మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధమైన పాలన సాగితేనే అభివృద్ధి పనులు వేగవంతమవుతాయని పేర్కొంటూ,అధికారులు తక్షణమే స్పందించి పేరూరు సమస్యను పరిష్కరించాలని కోరారు.



# మౌలిక సదుపాయాల కై వినతిపత్రం

మునగాల సెప్టెంబర్07

(ప్రజాజ్యోతి):




విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని మండల పరిధిలోని గణపవరం గ్రామంలో కొన్ని సంవత్సరాల నుండి ఎదురు చూస్తున్న ఎస్సీ కాలనీలో వాటర్ ప్లాంట్, కమ్యూనిటీ హాల్, గ్రంథాలయం గ్రామంలోని యువతకు అవసరమైన పుస్తకాలు మరియు మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని ఎంపీడీవో కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సూరేపల్లి ఉప్పలయ్య, సూరేపల్లి రమేష్, నెమ్మది ప్రియాంక, మాతంగి జయమ్మ, సీతారామయ్య, సూరేపల్లి శ్రీను, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గా కమిటీకి కొత్త కార్యవర్గం.. అధ్యక్షుడిగా కర్నాటి గణేష్

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి):

పురపాలక కేంద్రంలో సోమవారం నిర్వహించిన దుర్గా కమిటీ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కర్నాటి గణేష్, ఉపాధ్యక్షులుగా పొట్టబత్తిని సురేష్, గుండు ప్రేమ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా అంబటి సాయినాథ్, సహాయ కార్యదర్శులుగా ఏర్వ విగ్నేష్, బేటి నిఖిల్, కోశాధికారిగా రవ్వ నవీన్, సహాయ కోశాధికారిగా బోనకుర్తి హరీష్ కృష్ణ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కేమ విష్ణుమూర్తి, కుడికాల రాజ్ కుమార్, గుద్దేటి సాయి పవన్, భోగ దుర్గేష్, దోర్నాల ఓం ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు.



# కాంగ్రెస్ వెయ్యి రోజుల విఫల పాలనకు నిరసనగా బి ఆర్ ఎస్ ఆందోళన

మిర్యాలగూడ, సెప్టెంబర్ 07,(ప్రజాజ్యోతి):



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపిస్తూ సోమవారం మిర్యాలగూడ లో బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆధ్వర్యంలోసోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు,కార్యకర్తలు సమావేశమై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీగా బయలుదేరి గాంధీ బొమ్మ, బస్టాండ్ మీదుగా రౌండ్ దాకా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నినాదాలు చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ, ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ లతో ఆర్డీవో, ఎంపిడిఓ కార్యాలయాలలో వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహా రెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎడవెల్లి శ్రీనివాస రెడ్డి, అన్నబీమోజు నాగార్జున చారి,ఎండి.ఇలియాస్ ఖాన్, ధనావత్ చిట్టిబాబు నాయక్, ఎండి.మగ్దూం పాషా, ఎండి.మాజీద్, పద్మశెట్టి కోటేశ్వర రావు, గంగుల బిక్షం, చంద్రశేఖర రావు, రవి, దుర్గాప్రసాద్, మట్టపల్లి సైదులు యాదవ్,,ఎండి.షోయబ్,యర్రమల్ల దినేష్, చౌగాని బిక్షం గౌడ్, వింజం శ్రీధర్, పెంద్యాల పద్మ,కోదాటి రమా, షహనాజ్ బేగం, పెరుమాళ్ళ ధనమ్మ, లలిత,పార్టీనాయకులు, ప్రజాప్రతినిధులు, వార్డు ఇన్‌చార్జిలు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

## - వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎంపిటిసి చిరుమర్తి యాదయ్య

నార్కట్ పల్లి, సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి):



ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని మాజీ ఎంపీటీసీ చిరుమర్తి యాదయ్య డిమాండ్ చేశారు. నార్కట్ పల్లి మండల ప్రజావాణిలో మండలంలోని అన్ని గ్రామాల ముఖ్య నాయకులు కలిసి ఎమ్మార్వో, ఎంపీడీవోలకు వినతి పత్రాన్ని అందజేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తుందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి ప్రజల విశ్వాసాలను నిలబెట్టుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దుబ్బాక శ్రీధర్ యాదవ్, యానాల అశోక్ రెడ్డి, కర్నాటి ఉపేందర్, దుబ్బ రవి, పనస వెంకన్న, దోసపాటి విష్ణు, మేకల కరుణాకర్ రెడ్డి, వాజిద్ అలీ, నడింపల్లి నరేష్, బోయపల్లి శ్రీనివాస్, పుల్లెంల వెంకట్, మహేష్, సుధాకర్, నాంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# 100 రోజుల్లో ఆరు గ్యారంటీలన్నారు.. 1000 రోజులు కావస్తున్నా అమలు ఎక్కడ?

## - ప్రజావాణిలో కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ నాయకుల వినతి

**నకిరేకల్, సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి):**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను, ముఖ్యంగా ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు నకిరేకల్ మండల ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే 100 రోజులు దాటి, దాదాపు 1000 రోజులు కావస్తున్నా హామీలన్నీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని వారు విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కేవలం ప్రచారానికే పరిమితం చేయకుండా, వాటిని పూర్తిస్థాయిలో కార్యరూపంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో భాగంగానే వినతిపత్రం అందజేసినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రగాఢపు నవీన్‌రావు, కేతేపల్లి మండల అధ్యక్షుడు మార వెంకట్‌రెడ్డి, పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, సదానందం, నోముల కేశవరాజు, వీర్లపాటి రమేశ్, గుండగోని జంగయ్య, గణేశ్, కృష్ణకాంత్, దైద పరిమేశ్, సామ శ్రీనివాస్‌రెడ్డి, సైది రెడ్డి, భీమనబోయిన లింగరాజు, స్టీఫెన్, బాధిని రాము, మాచర్ల తిరుమల్, ముక్కముల శ్రీనివాస్, నాగిళ్ల లక్ష్మణ్ తదితర బీఆర్ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.



# దళితులం అంటూ అవమానిస్తున్నారు.. వివక్ష చూపుతున్నారు...!

## - ఉప సర్పంచ్ తీరుతో గ్రామాభివృద్ధికి ఆటంకాలు

## - జిల్లా కలెక్టర్‌కు అవంతిపురం సర్పంచ్ ఫిర్యాదు



**మిర్యాలగూడ, సెప్టెంబర్ 07,(ప్రజాజ్యోతి):**

మిర్యాలగూడ మండలం అవంతిపురం గ్రామ పంచాయితీలో ఉప సర్పంచ్ ఉప్పతల మహేష్ వ్యవహరిస్తున్న తీరుతో గ్రామ పాలన, అభివృద్ధి పనులకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయని గ్రామ సర్పంచ్ వల్దాసు సుజాత సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పంచాయితీ పరిపాలనకు అడ్డంకులు సృష్టిస్తున్న ఉప సర్పంచ్‌పై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుజాత మాట్లాడుతూ తాను కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచ్‌గా ఉండటంతో ఉప సర్పంచ్ రాజకీయ విభేదాలను గ్రామ పంచాయితీపరిపాలనలోకితీసుకువస్తున్నారని ఆరోపించారు. రాజకీయ కక్షలు, వ్యక్తిగత విభేదాల కారణంగా తన అధికారిక విధులకు పదేపదే ఆటంకాలు కల్పిస్తున్నారని ఫిర్యాదులోపేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి పనులు, పంచాయితీ ప్రతిపాదనలు, పూర్తయిన పనుల బిల్లులపై సంతకాలు చేయకుండా కాలయాపన చేస్తూ అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని ఆమె ఆరోపించారు. సమావేశాలకు కావాలని గైర్హాజరు కావడంతో పాటు, ఇతర వార్డు సభ్యులను కూడా సమావేశాలకు రాకుండాఅడ్డుకుంటున్నారని, దీంతో పంచాయితీసమావేశాల నిర్వహణకుఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. దళిత మహిళా సర్పంచ్‌గా ఉన్నందుకే వివక్ష చూపుతున్నారనే ఆవేదనను సర్పంచ్ వ్యక్తం చేశారు. తాను దళితురాలిననే కారణంతో తన హోదాను తక్కువ చేసి మాట్లాడటం,అవమానకరంగావ్యవహరించడం, మానసికంగాఇబ్బందులకు గురిచేయడం జరుగుతోందని ఆమె ఆరోపించారు. దళితులం అయినందుకే మాపై వివక్ష చూపుతున్నారనే భావన మానసిక క్షోభ అనుభవిస్తున్నామన్నారు. రాజకీయ, వ్యక్తిగత కక్షలకు తోడు సామాజిక వివక్షను కూడా ఎదుర్కొంటున్నాం అని ఆమె పేర్కొన్నారు. పంచాయితీసమావేశాలు, కార్యక్రమాల్లో సర్పంచ్ హోదాకు తగిన గౌరవం ఇవ్వకుండా వ్యవహరిస్తున్నారని, తన అధికారిక విధులను నిర్వర్తించకుండా అనుచిత ఒత్తిళ్లకు గురిచేస్తున్నారని సుజాత ఆరోపించారు. వ్యక్తిగత ప్రయోజనాలు, రాజకీయ కక్షల కోసం గ్రామ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదన్నారు. గ్రామ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా అధికారులు ఈ వ్యవహారంపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని సర్పంచ్ కోరారు. దళిత మహిళా సర్పంచ్‌గా తమపై జరుగుతున్న వివక్ష, వేధింపులపై కూడా విచారణ జరిపి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పంచాయితీ పరిపాలన రాజకీయ కక్షలు, వ్యక్తిగతప్రయోజనాలకు అతీతంగా సజావుగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. అలాగే తన అధికారిక విధులను స్వేచ్ఛగా నిర్వహించేందుకు రక్షణ కల్పించి, పంచాయితీ అభివృద్ధికి ఆటంకాలు కలిగిస్తున్న వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సర్పంచ్ వల్దాసు సుజాత విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



# బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అడ్డుకోవడంపై ఆగ్రహం
- నల్ల జెండాలతో జాతీయ రహదారిపై నిరసన

**నాగారం, సెప్టెంబర్ 07 ప్రజా జ్యోతి**

హైదరాబాద్‌లో శాసనసభ సమావేశాలకు హాజరయ్యేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రాకుండా పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ నాగారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టారు. మండల పార్టీ అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, శాసనసభలో ప్రతిపక్ష సభ్యుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పోలీసుల ద్వారా వారిని అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నించే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండగాని అంబయ్య, మండల సీనియర్ నాయకులు చిల్లర చంద్రమౌళి, దోమల బాలమల్లు, గంగయ్య, మండల యూత్ అధ్యక్షుడు ఈదుల కిరణ్ కుమార్, కూరం వెంకన్న, జంపాల రాజు, తారల ఆంజనేయులు, తిగుళ్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆయా గ్రామ శాఖ అధ్యక్షులు యల్లయ్య, సైదులు, అంజయ్య, నవీన్, వేణు రెడ్డి, రాములు, వీరయ్య, మంచినీళ్ల మహేందర్, తిగుళ్ల యాదగిరి, ఎర్ర నరేష్, మహేందర్, స్వామి, పవన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# గ్యాస్ ఏజెన్సీలో అవినీతి

**వలిగొండ సెప్టెంబర్07(ప్రజాజ్యోతి న్యూస్)**

వలిగొండ మండల కేంద్రంలోని సుమేధ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద సిలిండర్ తీసుకొని బరువు తక్కువగా ఉన్నది అనే సందేహంతో వినియోగదారుడు అయిన బి.జె.పి జిల్లా సీనియర్ నాయకుడు బంధారపు రాములు గ్యాస్ ఆఫీస్ దగ్గరికి వెళ్లి ఏజెన్సీ సిబ్బంది ముందే తనిఖీ చెయ్యగా 2.50 కిలోల బరువు తక్కువ రావడం జరిగింది. సిలిండర్ లో ఎటువంటి సమస్య లేదు అని మాకు ఎం తెలియదు ఇండియన్ గ్యాస్ కంపెనీ నుండి అలానే వస్తుంది అని మేనేజర్ తెలియజేసారు. సాధారణంగా సిలిండర్ డెలివరీ సమయంలో బరువు పరిశీలించిన తర్వాతే వినియోగదారులకు అందించాల్సి ఉన్నప్పటికీ, చాలా సందర్భాల్లో తూకం వేయకుండానే సిలిండర్‌ను ఇంటి వద్ద దింపి వెళ్తున్నారు చెప్పగా మేనేజర్ వంశీ నిర్లక్ష్య ధోరణికి వ్యక్తం చేశారు. 2 గంటల నిరీక్షణ తరువాత తనిఖీ చెయ్యడానికి అని రాకేష్ అనే వ్యక్తి వచ్చి తనిఖీ చేసి వచ్చుర్ బాగోలేదు అని చెప్పాడు. మెకానిక్ మండలంలో సిలిండర్లు డెలివరీ చేసే వ్యక్తి ఒక్కరే కావడం గమనార్హం. నిజానికి మండలంలోని దళారులు ఏజెన్సీ కూటమిగా అయి అవినీతికి పాల్పడుతున్నారు. ఆఫీస్ 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలకు ఎటువంటి డెలివరీ చార్జీలు తీసుకోకూడదు అయిన కానీ ప్రజల వద్ద దౌర్జన్యంగా తీసుకుంటున్నారు. ప్రజలకు నిత్యవసరం అయిన గ్యాస్ ఏజెన్సీలో ఎంతో కాలంగా జరుగుతున్న అవినీతిపై అధికారుల నిర్లక్ష్య ధోరణి గురించి ప్రజల్లో ఎన్నో అనుమానాలు ఏర్పడుతున్నాయని అని అన్నారు.



సుమేధ గ్యాస్ వలిగొండ





గ్యాస్ మెకానిక్, సర్వీస్ బాయ్





# ప్రజావాణికి 66 దరఖాస్తులు

- ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి
- పెండింగ్ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- ప్రజావాణి పోర్టల్‌లో దరఖాస్తులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలి
- జిల్లా,మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి
- సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట కలెక్టరేట్ సెప్టెంబర్ 07(ప్రజా జ్యోతి):**

ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా కొనసాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా,మండల స్థాయిలో స్వీకరించే ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్‌లో పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయడంతో పాటు,రాష్ట్రస్థాయి ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న అర్జీల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు. ప్రతి అధికారి తమ లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని,నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు సమర్పించిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.

**మండల స్థాయిలోనూ ప్రజావాణికి ప్రాధాన్యత**

మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. మండల స్థాయిలోనే స్థానిక సమస్యలను పరిష్కరిస్తే ప్రజలు జిల్లా కేంద్రానికి రావాల్సిన ఇబ్బంది తప్పుతుందని పేర్కొన్నారు.

**భూ సమస్యలపై అత్యధిక దరఖాస్తులు**

సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 66 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భూ సమస్యలకు సంబంధించి 35 దరఖాస్తులు, హౌసింగ్‌కు సంబంధించి 12, డీపీఓకు 3, డీఎంహెచ్ఓకు 3, ఇతర వివిధ శాఖలకు సంబంధించి 13 దరఖాస్తులు ఉన్నాయని తెలిపారు. అందిన దరఖాస్తులను శాఖల వారీగా సంబంధిత అధికారులకు పంపించి,సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్,డీఆర్వో ప్రేమ్ రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డీఆర్డీఓ పీడీ సన్యాసయ్య, డీఎంహెచ్ఓ వెంకటరమణ, డీఏఓ శ్రీధర్ రెడ్డి, డీఎస్ఓ మోహన్ బాబు, డీడబ్ల్యూఓ నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డితో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ తాత మధు మాటల వెనుక కేసీఆర్, కేటీఆర్ ల హస్తముంది తక్షణమే ఎమ్మెల్సీ రద్దు చేయాలి

## - బిఆర్ఎస్ అహంకారపు వైఖరికి నిరసనగా నేడు నిరసన ర్యాలీ

## - కాంగ్రెస్ నాయకుల వెల్లడి

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 07,(ప్రజాజ్యోతి):**



రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడిన మాటలను మిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని,ఈ మాటల వెనుక ఉన్న కెసిఆర్, కేటీఆర్ ల హస్తం ఉందని దిలావర్ పురు సర్పంచ్ జిల్లా కాంగ్రెస్ నాయకుడు సాయి అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయం రాజీవ్ భవన్



లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హరీష్ రావు, పాడి కౌశిక్ రెడ్డి, నవీన్ రెడ్డిల ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులను తొలగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు . ఏ భారత రాజ్యాంగం మీద ప్రమాణ స్వీకారం చేశారో ఆ భారత రాజ్యాంగం ప్రకారం స్పీకర్గా ఎన్నికైన వ్యక్తిని పట్టుకొని స్పీకర్ గాడు అని, అలాగే వారి చనిపోయిన తల్లిని కూడా అవమానపరిచే విధంగా మాట్లాడిన మాటలు యావత్ దళిత సమాజాన్ని కించపరిచిన మాటలుగా భావిస్తున్నామన్నారు . తక్షణమే శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారిని శాసనమండలి నుండి శాశ్వతంగా తొలగించాలని,మళ్లీ ఎప్పుడు కూడా ఎన్నికలలో పోటీ చేయకుండా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

**నేడు నిరసన ర్యాలీ :-**

టిఆర్ఎస్ నేతల తీరుకు నిరసనగా మంగళవారం( నేడు ) దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు వెల్లడించారు. దళితుల ఆత్మగౌరవాన్ని, రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడేందుకు జరిగే ఈ నిరసన కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ, మిర్యాలగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుండు నరేందర్ గౌడ్, వన్ టౌన్, టు టౌన్ అధ్యక్షులు కోడి రెక్క ఇంద్ర కుమార్,మోయిజ్ సర్పంచ ధనావత్ సిద్దు నాయక్,భాష నాయక్ రవి నాయక్, కౌన్సిలర్లు దైద సోమ సుందర్, శ్రీజ స్వప్న, దేశిడి శేఖర్ రెడ్డి పార్టీ సీనియర్ నాయకులు ఉబ్బపల్లి కాశయ్య, జిందా, తలకొప్పుల సైదులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్తులకు బోనాల పండుగ శుభాకాంక్షలు:సర్పంచి

**చింతపల్లి 07(ప్రజాజ్యోతి)**

చింతపల్లి మండలం పోలేపల్లి రాంనాగర్ లో నేడు జరగబోయే బోనాల పండుగ సందర్భంగా గ్రామానికి వచ్చినటువంటి ఆడ పడుచులకు,కుటుంబ సభ్యులకు మరియు బంధుమిత్రులకు, గ్రామస్తులకు సర్పంచి దొంతగోని యాదమ్మ గ్రామస్తులక బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఆమె మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతికి ప్రతీక బోనాల పండుగ అన్నారు.గ్రామ దేవతల ఆశీస్సులు ప్రతి ఒక్కరిమీద ఉండాలని ఆమె కోరారు.




# పుల్లయ్య పార్థికదేహానికి పూలమాలలు వేసిన కాంగ్రెస్ నాయకులు

**రామన్నపేట సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి)**

రామన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన కేశవ బోయిన పుల్లయ్య ముదిరాజ్ అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. మృతదేహాన్ని పూలమాలవేసి నివాళులర్పించి నారు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ ఉపసర్పంచ్ మోటె రమేష్ మాజీ ఎంపీటీసీలు వనం చంద్రశేఖర్ మొహమ్మద్ రేహాన్ మొహమ్మద్ అక్రం కోట సుధాకర్ వాడు సభ్యు లు కొమ్ము శేఖర్ మొహమ్మద్ అన్వర్ గొరిగె శేఖర్ బండ లింగస్వామి నకరికంటి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



# వినాయక మండపాలకు ఆన్‌లైన్ అనుమతి తప్పనిసరి

## - పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి

## - నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

## - చౌటుప్పల్ సీఐ మన్మధ కుమార్



**చౌటుప్పల్, సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి)**

గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీస్ శాఖ నుంచి ఆన్‌లైన్ ద్వారా ముందస్తు అనుమతులు తీసుకోవాలని చౌటుప్పల్ సీఐ జి.మన్మధకుమార్ తెలిపారు. హ్టీజుం:// జుశీశ్రీఱ వజుశీళీశ్రీ.ంజుశీశ్రీఱవ.స్ట్రశీఙ.ఱఅ/ఱఅఎవ×.ష్ట్రవ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, మండపం ఏర్పాటు చేసే స్థలంతో పాటు నిర్వాహక కమిటీ సభ్యుల వివరాలను నమోదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం నిబంధనలకు లోబడి ఉంటేనే క్యూఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ ఎన్‌వోసీ (చీూజ) అనుమతి పత్రాలు జారీ చేస్తామని పేర్కొన్నారు.రహదారులపై ట్రాఫిక్‌కు, పాదచారుల రాకపోకలకు ఆటంకం కలిగించేలా మండపాలు ఏర్పాటు చేయవద్దని స్పష్టం చేశారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నాణ్యమైన వైరింగ్ వాడాలని, ముందస్తు జాగ్రత్తగా ఇసుక, నీటి బకెట్లను మండపాల వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం శబ్ద కాలుష్య నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, నిర్దేశిత సమయాలు దాటిన తర్వాత మైకులు వాడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవడానికి ప్రజలు పోలీసులకు సహకరించాలని, అత్యవసర సమయాల్లో డయల్ 100 లేదా 112 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

ప్రజాజ్యోతి
మంగళవారం 08 సెప్టెంబర్ 2026

# ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

## - గ్రామ ప్రజలందరూ సహకారంతో ఆలయ నిర్మాణం

## - సర్పంచ్ ఎర్ర సావిత్రి యాదగిరి

**నాగారం సెప్టెంబర్ 07ప్రజా జ్యోతి.**



నాగారం మండలం ఫణిగిరి గ్రామంలో ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ ఎర్ర సావిత్రి యాదగిరి, గుండెబోయిన వీరయ్య స్వప్న దంపతులు ఆలయ నిర్మాణ స్థలంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పాల్గొని ఆలయ నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ముత్యాలమ్మ ఆలయ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అనుగుణంగా ముత్యాలమ్మ ఆలయం నిర్మాణం జరగడం ఆనందంగా ఉందన్నారు.

**- ప్రజల సహకారంతో నిర్మాణం**

ఆలయ నిర్మాణానికి గ్రామ ప్రజలు ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తున్నారని సర్పంచ్ ఎర్ర సావిత్రి యాదగిరి తెలిపారు. గ్రామస్తుల భాగస్వామ్యంతో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి, భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు.ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని ఆమె కోరారు.ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించడంతో గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది.ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం కావడం పట్ల గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్న సర్పంచ్‌ను , వీరయ్య స్వప్నకు ,పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో దుర్గా ప్రసాద్,ఉప సర్పంచ్ భాను ప్రకాష్ యాదవ్, మాజీ సర్పంచ్, గునుగుంటి రాములు, సోమేశ్, వెంకటాచారి, రావుల సత్తయ్య, జై ,రాములు, సోమరపు లింగయ్య, పులిగిల్ల లింగయ్య, రావుల రాములు, గ్రామ వార్డు మెంబర్స్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు



# మెరుగైన వసతులతో నాణ్యమైన విద్య

## - మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి

**హాలియా,సెప్టెంబర్7(ప్రజా జ్యోతి)**

హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఆరవ వార్డులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రా రెడ్డి యూనిఫామ్ బూట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు దుస్తులు,బూట్లను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ చింతల చంద్రారెడ్డి మాట్లాడుతూ,ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన అన్ని వసతులు కల్పించడమే తమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులకు,పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మున్సిపాలిటీ ఎల్లవేళలా పూర్తి సహకారం అందిస్తామని హాజరైన వారికి హామీ ఇచ్చారు. పాఠశాల విద్యార్థులకు కావలసిన కనీస వసతులు సమకూర్చడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు మున్సిపల్ చైర్మన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాజా రమేష్ యాదవ్, స్థానిక వార్డు కౌన్సిలర్ బొంగరాల,కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు,నకిరేకంటి సైదులు, చిట్టి ప్రోలు కరుణాసాగర్, మజహర్ మొహినుద్దీన్, కుకడాల ఆంజనేయులు,గడ్డం రమణయ్య,మద్దిమడుగు కిషోర్ ప్రధానోపాధ్యాయులు జయపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ వెయ్యిరోజుల పాలన పై ప్రజావాణి లో విజ్ఞాపన పత్రం

**నాగారం సెప్టెంబర్ 07 ప్రజా జ్యోతి.**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తి అయిన సందర్భంగా సోమవారం నాగారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం నందు కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజులధగా పాలనపై నాగారం మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజావాణి లో విజ్ఞాపన పత్రం అందజేయడం జరిగింది. విజ్ఞాపనపత్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అయినటువంటి 420 హామీలు 13డిక్లరేషన్ లు 6గ్యారంటీలు వంద రోజుల్లో నెరవేరుస్తామని చెప్పి ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. అమలు కానీ వాటిని వెంటనే అమలు చేయాలని కోరారు మహిళలకు 2500 కల్యాణలక్ష్మి కింద తులం బంగారం విద్యార్థినులకు స్కూటీలు రైతు కూలీలకు 12000 నిరుద్యోగ భృతి జాబ్ క్యాలెండరు 4000పెన్షన్ ఎరువుల కొరత లేకుండా వ్యవసాయనికి 24గంటల నిరంతర ఉచిత విద్యుత్ మరియు ప్రతి పంటకు రైతు భరోసా అందించాలని ఆటో డ్రైవరన్నలకి 12000 అందిచలని ప్రభుత్వ హామీలు అడిగిన వారి పై అక్రమ కేసులు పెడుతున్నారని వెంటనే వీటిని ఆపాలని కోరారు ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కళ్లెట్లపల్లి ఉప్పలయ్య మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండగాని అంబయ్య మండల సీనియర్ నాయకులు చిల్లర చంద్రమౌళి దోమల బాలమల్లు గంగయ్య మండల యూత్ అధ్యక్షుడు ఈదుల కిరణ్ కుమార్ కూరం వెంకన్న జంపాల రాజు తారల ఆంజనేయులు తిగుళ్ళ ప్రశాంత్ ఆయా గ్రామ శాఖ అధ్యక్షులు యల్లయ్య సైదులు అంజయ్య నవీన్, వేణు రెడ్డి ,రాములు వీరయ్య మంచినీళ్ళ మహేందర్ తిగుళ్ళ యాదగిరి ఎర్ర నరేష్ మహేందర్ స్వామి పవన్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# యువత స్వశక్తితో ఎదగాలి

## - నాణ్యత,పరిశుభ్రతతో వినియోగదారుల ఆదరణ పొందాలి

## - మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి





**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 07(ప్రజా జ్యోతి):**

యువత స్వశక్తితో ఎదిగి,ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట నూతనంగా ఏర్పాటు చేసిన స్మాష్ కేఫ్ అండ్ రెస్టారెంట్ను మేఘన ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొప్పుల వేణారెడ్డి కేఫ్ నిర్వాహకులు, 5వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మద్దెబోయిన తిరుమలేశ్, నిర్వాహకులు మద్దెబోయిన సాయిరాంలకు శుభాకాంక్షలు తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ వారి విశ్వాసాన్ని, ఆదరణను పొందాలని సూచించారు.ప్రస్తుత పోటీ వాతావరణంలో నాణ్యత, పరిశుభ్రత, మంచి రుచితో పాటు వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలు అందించడం ద్వారా స్మాష్ కేఫ్ మంచి ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వశక్తితో ఉపాధి అవకాశాలను సృష్టించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ అబ్దుల్ కరీం, 5వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పఠాన్ నబీ ఖాన్, మద్దెబోయిన శ్రీనివాస్, తన్నీరు వెంకన్న, పెద్దగట్టు మాజీ డైరెక్టర్ నల్లబోతు నాగరాజు యాదవ్, మాజీ ఎంపీటీసీ ధరావత్ సాగర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రాపర్తి నాగరాజు, కొత్తపల్లి వెంకన్న, సయ్యద్ జావేద్, సంజ్యాల వినయ్ వర్మ, అనంతుల నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# బిసి హాస్టల్ వార్డెన్ల అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలంటూ...!

## - జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 07,(ప్రజాజ్యోతి):**

నల్గొండ జిల్లా బీసీ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న వసతి గృహ సంక్షేమ అధికారుల అక్రమ డిప్యూటేషన్లను తక్షణమే రద్దు చేయాలని బీసీ విద్యార్థి సంఘం మరియు బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో సోమవారం నాడు జిల్లా కలెక్టర్ కి ప్రజావాణి లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్య యాదవ్, బిసి రాజ్యాధికార సమితి నల్గొండ జిల్లా అధ్యక్షుడు కర్నాటి యాదగిరిలు మాట్లాడుతూ బీసీ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఒక్కొక్క వార్డెన్లు గత పది నుంచి 15 సంవత్సరాలుగా నలగొండ పట్టణంలోనే పనిచేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలో భాగంగా సుమారు నల్గొండ నుంచి ఒక 30 కిలోమీటర్ల దూరం కి బదిలీ కావడం జరిగిందన్నారు. కానీ మూడు నెలలు పూర్తికాకముందే మళ్లీ అక్రమ ట్రాన్స్ఫర్లు మరియు డిప్యూటేషన్ల పేరుతో ప్రభుత్వ జీవోలకు విరుద్ధంగా మళ్లీ నల్గొండ పట్టణానికి రావాలని ప్రయత్నాలు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పీజీలు చేసి ఉద్యోగాలు రాక నిరుద్యోగులు రోడ్లమీద తిరుగుతుంటే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వసతి గృహ  సంక్షేమ అధికారులు వారు ఉంటున్న ఊర్లోనే ఉద్యోగాలు కావాలనుకోవడం, గతంలో పది నుంచి 15 సంవత్సరాలు నల్గొండ పట్టణంలో ఉద్యోగం చేస్తూ వేరే దగ్గరికి బదిలీ అయ్యి మళ్ళీ నల్గొండ పట్టణానికి రావడం కోసం బీసీ సంక్షేమ శాఖలో అక్రమ ట్రాన్స్ఫర్ ల పేరుతో



రావాలనుకోవడం పట్ల బీసీ సంఘాల తరపున దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు . బీసీ సంక్షేమ శాఖలో జరుగుతున్న టువంటి అక్రమ డిప్యూటేషన్లు మరియు ట్రాన్స్ఫర్లను తక్షణమే రద్దు చేయడంతోపాటు ఒక్కొక్క అధికారికి రెండు మూడు హాస్టల్లను ఇన్చార్జిగా ఇవ్వటం కూడా రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ కి విన్నవించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ తక్షణమే దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇట్టి విషయంపై త్వరలోనే తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్,బీసీ సంక్షేమ శాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళ్లి అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, కర్ణాకర్, సత్తయ్య, జానీ భాష, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ధ్యానంతో లాభాలు ఎన్నో..

## - మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుంది

## - తహసీల్దార్ ఎల్. మంగ

**నడిగూడెం, సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి)**

ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని తహసీల్దార్ ఎల్. మంగ అన్నారు. సోమవారం నడిగూడెం మండలంలోని వల్లాపురంజక్కేపల్లి సరిహద్దులో ఉన్న గరుడ పిరమిడ్లో నిర్వహించిన ధ్యాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిత్య జీవితంలో ఎదురయ్యే ఒత్తిడి, ఆందోళనను తగ్గించుకోవడానికి ధ్యానం ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రతిరోజూ కొంత సమయం ధ్యానానికి కేటాయిస్తే మనస్సు ప్రశాంతంగా ఉండటంతో పాటు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయని తెలిపారు.ధ్యానం వల్ల కోపం, ఆందోళన తగ్గి సానుకూల ఆలోచనలు పెరుగుతాయని, ఆరోగ్యకరమైన జీవనశైలికి ఇది ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవితంలో ధ్యానాన్ని ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఎస్ఐ తేజస్విని, సీనియర్ పిరమిడ్ మాస్టర్ అచ్చిరెడ్డి, ధ్యానులు తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యోగ హక్కుల సాధనకై సెప్టెంబర్ 10న హైదరాబాద్ లో భారీ సభ

## అనంతగిరిలో గోడ ప్రచార పత్రం ఆవిష్కరణ

**అనంతగిరి (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 07**

సెప్టెంబర్ 10న హైదరాబాద్ నందు జరగనున్న ఉద్యోగుల సాధన హక్కుల సభను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ అనంతగిరిలో టీఎన్జీవో నాయకులు చలో హైదరాబాద్ గోడ ప్రచార పత్రాన్ని ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా టీఎన్జీవో కోదాడ ప్రధాన కార్యదర్శి పొలంపల్లి వెంకట నగేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం,పెండింగ్ లో ఉన్న డీఏలు,పీఆర్సీ,ఉద్యోగుల బదిలీలు,పదోన్నతులు,ఆరోగ్య భద్రత కార్డుల అమలు తదితర న్యాయమైన డిమాండ్ల సాధన కోసమే సెప్టెంబర్ 10న హైదరాబాద్ లో సాధన హక్కుల సభ నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ సభలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు,పింఛనుదారులు అందరూ కుటుంబ సమేతంగా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఉద్యోగుల ఐక్యతను చాటి చెప్పేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని,ప్రభుత్వం తమ న్యాయమైన కోర్కెలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవో నాయకులు కోశాధికారి మట్టపల్లి మహేష్,ప్రసాద్,గంటే పొంగు విక్రమ్,లక్ష్మారెడ్డి,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా విగ్రహ,ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

### – వైభవంగా ముగిసిన శ్రీదుర్గా మల్లేశ్వర దేవాలయ మహోత్సవాలు

### – భారీగా తరలివచ్చిన భక్తులు,ప్రత్యేక పూజలు

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 07(ప్రజా జ్యోతి):**

సూర్యాపేట పట్టణ పరిధిలోని శాంతినగర్‌లో శ్రీదుర్గా మల్లేశ్వర దేవాలయంలో కనకదుర్గ,బంగారు మైసమ్మ,పరమశివుడు విగ్రహాల ప్రతిష్ఠాపనతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి.శ్రీలక్ష్మీనరసింహ ట్రస్ట్ ఆధ్వర్యంలో,దేవాలయ కమిటీ చైర్మన్ ఉప్పల గురునాథం అధ్యక్షతన నిర్వహించిన ఈ మహోత్సవాల్లో చివరి రోజు సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ముగింపు ఉత్సవాల్లో భాగంగా హోమాలు, పూర్ణాహుతి, మంత్రస్థాపన, తదియారాధన తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ మహోత్సవానికి రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ పి.అలేఖ్య మంజుల ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లను ఆమె అభినందించారు.గౌరవ అతిథులుగా ఈగ దయాకర్ గుప్తా, పెద్దిరెడ్డి గణేష్, తోట శ్యాం ప్రసాద్, బెలిదే శ్రీనివాసులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు గజ్జల రవీందర్, తల్లాడ వెంకటేశ్వర్లు, గుండా రమేష్, మంచాల అంబరీష్, రంగయ్య, నూనె యుగంధర్, కర్నాటి మధు, వీర్లపాటి వెంకటేశ్వర్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.మహోత్సవాలకు వేలాది



మంది భక్తులు హాజరై కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి..

# ఎండిపోతున్న పంట పొలాలను కాపాడాలంటూ...!

# సబ్ స్టేషన్ ముట్టడించి రైతుల నిరసన

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 07,(ప్రజాజ్యోతి):**

కాలం కాకపోయినా.. బోర్లను నమ్ముకుని... వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేపట్టాం... విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం.. వోల్టేజీతో కళ్ళముందే పొట్ట పొలాలు ఎండిపోయే పరిస్థితి దాపురించింది సమస్యను గుర్తించాలంటూ.. పరిష్కరించాలంటూ ఆవేదనతో ఆగ్రహంతో మండలంలోని రాయిని పాలెం గ్రామానికి చెందిన రైతులు అవంతీపురం సబ్ స్టేషన్ ను ముట్టడించి ఆందోళనకు దిగిన సంఘటన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వ్యవసాయ పొలాలకు ఇచ్చే 12 గంటల విద్యుత్తు ఇవ్వాలని నిబంధనలుఉన్నప్పటికీ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో పంట పొలాలు ఎండిపోయే దశకు చేరాయన్నారు. రాయినిపాలెం నూతన సబ్ స్టేషన్ పనులు పూర్తయినప్పటికీ ప్రారంభించక పోవడం తో విద్యుత్ సరఫరా దారుణంగా ఉందన్నారు.సబ్ స్టేషన్ వెంటనేప్రారంభించాలనినిరసన చేశారు. సమాచారం అందుకున్న విద్యుత్ డిఈ శ్రీనివాసచారి, రాజేశ్వరరావులు అక్కడకు చేరుకొని రైతులకు కలిగిన విద్యుత్ అసౌకర్యాన్ని నివారించి, నూతన సబ్ స్టేషన్ త్వరలోనే ప్రారంభిస్తా మని చెప్పడంతో రైతులు నిరసన విరమించారు. ఈకార్యక్రమంలో రాగిరెడ్డి జగ్గారెడ్డి, కాకునూరు సైదులు, సత్య రెడ్డి, పోలేపల్లి నారాయణరెడ్డి,పిండి శ్రీనివాస్ రెడ్డి, బొబ్బ శేఖర్, కుమ్మరి కుంట్ల శ్రీను, పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, పోలపల్లి వెంకటరెడ్డి, యాతం నర్సిరెడ్డి, నిమ్మల వెంకన్న, పోలగని మంగయ్య, గోలి శీను, కొనుగంటి సూరారెడ్డి, కాకునూరు శ్రీను, చిమట రవి, చిలకల వీరయ్య, మంగయ్య, తదితరులు పాల్గొన్నారు.





# టూరిజం పార్కులో విద్యార్థినుల సందడి

**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి):**

హైదరాబాద్‌కు చెందిన సెయింట్ ఫ్రాన్సిస్ జూనియర్ కళాశాల ఫర్ ఉమెన్ విద్యార్థినులు సోమవారం భూదాన్ పోచంపల్లి టూరిజం పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులోని పర్యాటక విశేషాలను వీక్షిస్తూ, పోచంపల్లి ప్రకృతి అందాలను ఆస్వాదించారు. విద్యార్థినుల పర్యటన సందడిగా సాగింది.



# యువతను వంచిస్తున్న ప్రభుత్వాలపై పోరాటానికి సిద్ధం కావాలి



## - జాబ్ క్యాలెండర్ లేదు.. నిరుద్యోగ భృతి లేదు.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలే

## - డీవైఎఫ్ఐ జిల్లా రెండో మహాసభలను జయప్రదం చేయండి: కేసగాని భద్రయ్య

**నడిగూడెం, సెప్టెంబర్ 7, ప్రజా జ్యోతి:**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతీ యువకులను మోసం చేస్తున్నాయని డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి కేసగాని భద్రయ్య విమర్శించారు. సెప్టెంబర్ 8న నిర్వహించనున్న డీవైఎఫ్ఐ సూర్యాపేట జిల్లా రెండో మహాసభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఉత్సవాలు నిర్వహించడం బాధాకరమని, యువతకు ఏమి చేశారని ఉత్సవాలు నిర్వహిస్తున్నారని భద్రయ్య ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి అమలు చేయలేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన వేల కోట్ల రూపాయలు బకాయిలుగా ఉన్నాయని అన్నారు. జీవో 97తో విద్యార్థులకు నష్టం జరుగుతోందని, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. విద్యార్థులకు ఉచిత ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామని చెప్పి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కుంభకోణాలు, కుమ్ములాటలు, మాటల మూటలు, అవినీతి జోరు, ఆధిపత్య పోరుతో పాలన అయోమయంగా మారిందని భద్రయ్య విమర్శించారు. సూర్యాపేట జిల్లా నలుమూలల నుంచి యువతీ యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జిల్లా రెండో మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# ఛలో ఇందిరాపార్క్‌కు అడ్డుకట్ట.. బీజేపీ నేతల ముందస్తు అరెస్టు

**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి):**

ఫీజు బకాయిల విడుదలను డిమాండ్ చేస్తూ ఇందిరాపార్క్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నేతృత్వంలో నిర్వహించనున్న మహాధర్నాకు వెళ్లకుండా పోచంపల్లి బీజేపీ నాయకులను పోలీసులు సోమవారం ముందస్తుగా అరెస్టు చేశారు. రూ.15 వేల కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేసి 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని జిల్లా మాజీ కార్యదర్శి చింతల రామకృష్ణ డిమాండ్ చేశారు. అరెస్టులతో ఉద్యమాలను అణిచివేయాలని చూస్తే ప్రజలు, విద్యార్థులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అరెస్టయిన వారిలో వంగూరి రాజు, రచ్చ సత్యనారాయణ, గొలనుకొండ ప్రభాకర్, సీత, మణికంఠ, నిఖిల్ తదితరులు ఉన్నారు.




# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

## - చౌటుప్పల్ ఆర్డీవోకు బీఆర్ఎస్ వినతిపత్రం

## - మాట నిలబెట్టుకోకుంటే ఆందోళనలు తప్పవని హెచ్చరిక

**చౌటుప్పల్, సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి)**

శాసనసభ ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు చౌటుప్పల్ మండలం, పురపాలిక బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు గిర్కటి నిరంజన్‌గౌడ్, మున్సిపల్ కన్వీనర్ బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా ఎన్నికల హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అవినీతి, ఏకపక్ష నిర్ణయాలతో పాలన సాగిస్తూ ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే ఆరు గ్యారెంటీలతో పాటు ఇచ్చిన అన్ని హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజలతో కలిసి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్



చింతల దామోదర్‌రెడ్డి, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు తాండూరి పరమేష్, కౌన్సిలర్లు కొయ్యడ శేఖర్‌గౌడ్, గడ్డం ఇందిరా రాజారత్నం, ఉదరి యాదయ్య, మాజీ గ్రంథాలయ ఛైర్మన్ ఉడుగు మల్లేష్‌గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సూర్వి మల్లేష్‌గౌడ్, నాయకులు ఢిల్లీ మాధవరెడ్డి, అత్తార్ పాషా, చెవగోని మహేష్‌గౌడ్, మున్నా, మెట్టు మహేశ్వర్‌రెడ్డి, బొమ్మగోని మల్లేష్‌గౌడ్, ముషీర్, సంగిశెట్టి శివ, రఘు, అబ్బాస్, ఇమ్మడి ఈశ్వర్‌గుప్తా, అత్తు తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి బండారు కవితారెడ్డి అండ

## - లతీఫ్ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం - కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుందని భరోసా




**నడిగూడెం, సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి)**

బీజేపీ నడిగూడెం మండల మాజీ ఉపాధ్యక్షులు షేక్ లతీఫ్ మృతి విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బండారు కవితారెడ్డి సోమవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. కష్టకాలంలో కుటుంబ సభ్యులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటారని, ధైర్యంగా ఉండాలని కవితారెడ్డి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నడిగూడెం మండల అధ్యక్షులు బండారు వీరబాబు యాదవ్, కోదాడ టౌన్ అధ్యక్షులు గోదేశి లక్ష్మణ్, అనంతగిరి మండల అధ్యక్షులు చింతకుంట్ల సతీష్, కేశగాని పాపయ్య, ముప్పా నర్సింహారావు, బీరవెల్లి గోపాల్‌రెడ్డి, రవి, రెడ్డిపల్లి రాముడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాజ్యోతి

మంగళవారం 08 సెప్టెంబర్ 2026

# ' పంచ్ ' లతో ' పతకాలు

# కొల్లగొడుతున్న అన్నా చెల్లెళ్లు

## - జాతీయ, అంతర్జాతీయ వేదికల్లో సత్తా చాటిన గుండా కార్తికేయ,గీత ప్రణవి లు








**మిర్యాలగూడ, సెప్టెంబర్ 07,(ప్రజాజ్యోతి):** ఆత్మరక్షణ విద్య కరాటే రింగ్ లో వారు అడుగుపెడితే చాలు ' పంచ్ 'ల పవర్ కు ప్రత్యర్థి మట్టి కరవాల్సిందే... పతకంముద్దాడాల్సిందే! ఒకరిని చూసి మరొకరు స్ఫూర్తి పొందుతూ,పోటీ ఏదైనా సరే పతకాలతో సాధించుకుని తిరిగి వస్తున్నారు ఆ అన్నాచెల్లెళ్లు...వాళ్ళే నల్గొండ జిల్లా, మిర్యాలగూడ లోని ఎస్ ఎస్ కే కరాటే అకాడమీకి చెందిన చిన్నారులు, మహా న్యూస్ రిపోర్టర్ గుండా మహేష్, చంద్ర కళ దంపతుల కుమారుడు, కుమార్తె లు గుండా కార్తికేయ, గుండా గీత ప్రణవి లు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన కరాటే ఛాంపియన్‌షిప్‌లలో పంచ్‌లు,కిక్‌లతో ప్రత్యర్థులను చిత్తు చేస్తూ మెడల్స్ సాధించారు.ఈ నెల 4,5 తేదీల్లో గచ్చిబౌలి వేదికగా జరిగిన 'తైకా ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ - 2026' లో కార్తికేయ అద్భుత ప్రదర్శనతో అండర్ -12 విభాగంలో కటా,ఫైటింగ్ విభాగాల్లో రెండు సిల్వర్ పతకాలు సాధించాడు.అంతేకాకుండా,గత నెల 26న హైదరాబాద్ ఎల్బీనగర్‌లో జరిగిన 'ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ - 2026' లోనూ తన మార్క్ చూపిస్తూ అండర్-12 ఫైటింగ్‌లో గోల్డ్ పతకాన్ని,కటా విభాగంలో బ్రాంజ్ పతకాన్ని కైవసం చేసుకున్నాడు.అన్న చూపుతున్న విజయోత్సాహంతో, ఆయన స్ఫూర్తితో రింగ్‌లోకి దిగిన కార్తీక్ చెల్లెలు చిన్నారి గుండా గీత ప్రణవి సైతం తన పంచ్‌లతో ఆకట్టుకుంటుంది .ఈ రెండు ప్రతిష్టాత్మక పోటీల్లోనూ పాల్గొన్న గీత ప్రణవి కూడా అండర్-10 లో కటా విభాగంలో పోటీపడి రెండు కాంస్య, బ్రాంజ్ పతకాలను తన ఖాతాలో వేసుకుంది.చిన్న వయసులోనే జాతీయ,అంతర్జాతీయ స్థాయి వేదికలపై మెరుపులు మెరిపిస్తున్న ఈ ఇద్దరినీ,వారి వెనుక ఉండి నడిపిస్తున్న ఎస్ ఎస్ కే కరాటే అకాడమీ కోచ్ రామకృష్ణను, ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను ప్రముఖులు, స్థానికులు,క్రీడాభిమానులు అభినందిస్తున్నారు.











# ప్రతిపక్షాల హక్కులను హరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## – బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నల్లగాటి ప్రసన్న రాజ్

## – అసెంబ్లీ ఘటనకు నిరసనగా నకిరేకల్‌లో భారీ ఆందోళన

**నకిరేకల్, సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి):**





ప్రతిపక్షాల గొంతు నొక్కుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని బీఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు నల్లగాటి ప్రసన్న రాజ్ ఆరో పించారు. అసెంబ్లీకి వెళ్లకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపు నిచ్చిన నేపథ్యంలో సోమవారం నకిరేకల్‌లో నల్లగాటి ప్రసన్న రాజ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన చేపట్టారు. నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసుల అణచివేత చర్యలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నల్లగాటి ప్రసన్న రాజ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రాకుండా అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ప్రతిపక్షాల ప్రశ్నించే హక్కును హరించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు ప్రతిపక్షాల హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు.

# ప్రైవేటు,కార్పొరేట్ పాఠశాలల్లలో ఉపాధ్యాయుల జ్ఞాన దోపిడిని అరికట్టాలంటూ...!

## - ఎంఈఓ కి అడ్వొకెట్ రవి ఫిర్యాదు

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 07,(ప్రజాజ్యోతి):**

మిర్యాలగూడ పరిధిలోని నారాయణ, శ్రీ చైతన్య తదితర ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు అనుసరిస్తున్న అనైతిక విధానాలు, ఉపాధ్యాయుల మేధో సంపత్తి దోపిడీపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ అడ్వకేట్ ధీరావత్ రవి సోమవారం మండల విద్యాశాఖాధికారి ధర్మా నాయక్ కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అడ్వకేట్ ధీరావత్ రవి మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ వద్ద పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందిని తీవ్రంగా దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. ఉపాధ్యాయులు సొంతంగా తయారు చేసుకున్న బోధనా సామగ్రి, ప్రత్యేక కరికులమ్ డిజైన్లు, బోధనా పద్ధతులను యాజమాన్యాలు కాపీ చేస్తూవ్యాపారాత్మకంగా వాడుకుంటున్నాయని తెలిపారు. ఇలా వారి జ్ఞానాన్ని, మేధోశ్రమను వాడుకున్న తర్వాత, ఉపాధ్యాయులకు సరైన గుర్తింపు గానీ, తగిన వేతనం గానీ ఇవ్వకుండాఅన్యాయంగా ఉద్యోగులను వేధింపులకు గురచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలుకార్మిక, వృత్తిపరమైన నిబంధనలను ఉల్లంఘించడమే కాకుండా, ఉపాధ్యాయ వృత్తి యొక్క గౌరవాన్ని దిగజార్చేలా ఉన్నాయని అన్నారు. మిర్యాలగూడలోని కార్పొరేట్ పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయుల ఉద్యోగ షరతులపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలి. ఉపాధ్యాయుల హక్కులను




పరిరక్షిస్తూ, న్యాయమైన ఉద్యోగ నిబంధనలను అమలు చేసేలా పాఠశాల యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలి. విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘిస్తున్న పాఠశాల యాజమాన్యాలపై కఠినమైన పరిపాలనా మరియు చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఈ కార్యక్రమం లో టి ఆర్ జి ఎస్ ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు ధీరావత్ శ్రీను నాయక్,అడ్వకేట్ పరమేష్,నాగేందర్, తరుణ్ నాయక్, ఆంజనేయులు, సిపాయి,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# యాభై సంవత్సరాల ప్రస్థానానికి కొండా లక్ష్మణ్ బాపూజీ కళారత్న అవార్డు ప్రధానం

**రామన్నపేట సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి)**

నేతన్న టీవీ, స్వరాజ్ న్యూస్ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ సాధించిన పద్మశాలి ప్రముఖులకు అవార్డ్స్ ప్రధాన కార్యక్రమం హన్మకొండ పట్టణంలోని నాామా క్యాంపస్ ఆడిటో రియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్ధ శతాబ్దపు నమ్మకమైన వ్యాపార ప్రతిభకు సత్కారంగా రామన్నపేట మండల కేంద్రంలోని రమేశ్ మెడికల్ & జనరల్ స్టోర్స్కు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 'కళా రత్న' 2026 పురస్కారం (అవార్డ్ ) ప్రధానం జరిగింది. ఈ మేరకు జరిగిన కార్యక్రమంలో నేతన్న టీవీ సీఈఓ పులిపాటి రాజేందర్ చేతులమీదుగా రాపోలు రమేశ్ ను అభినందించి సత్కరించారు. అవార్డు ప్రధాన కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కుడా చైర్మన్ శ్రీమతి గుండు సుధారాణి, అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి, తెలంగాణ పద్మశాలి సంఘం అధ్యక్షులు కమర్తపు మురళి, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# విద్యుత్ ఎస్ ఈ గా పి.యాదగిరి బాధ్యతలు

## - తెలంగాణ విద్యుత్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 07(ప్రజా జ్యోతి):**

సూర్యాపేట విద్యుత్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ)గా పి.యాదగిరి సోమవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యుత్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. సంఘం ప్రతినిధులు ఎస్ఈ పి.యాదగిరికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సూర్యాపేట విద్యుత్ సర్కిల్ పరిధిలో వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు,విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యుత్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముత్యం వెంకన్న గౌడ్,వర్కింగ్ ప్రెసిడెంట్ బ్రహ్మానందరావు,కంపెనీ సెక్రటరీ బొబ్బిలి మురళి,జిల్లా గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్,జిల్లా అధ్యక్షులు గుండు పరుశరాములు,జిల్లా కార్యదర్శి బెల్లంకొండ భరత్,డివిజన్ అధ్యక్షులు ఉపేందర్,కార్యదర్శి కృష్ణారావు,నాయకులు స్వాతి,హరీష్ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను పూర్తి చేసి మా కుటుంబాలకు అందాల్సిన ప్రయోజనాలను పూర్తి చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేత..

## - బి ఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నల్ల భూపాల్ రెడ్డి....

**అనంతగిరి (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 7 2026**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరుతూ బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నల్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో అనంతగిరి ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉంటే,రేవంత్ రెడ్డి ప్రభుత్వం 6 గ్యారెంటీల పేరుతో, 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. వంద రోజుల్లోనే అన్ని హామీలు అమలు చేస్తామని గొప్పలు చెప్పిన నాయకులు,నేడు వందల రోజులు గడిచినా ఒక్క హామీని కూడా సంపూర్ణంగా నెరవేర్చలేకపోయారని మండిపడ్డారు. ప్రస్తుతం ప్రభుత్వం 22ఏ నిషేధిత జాబితా పేరుతో పేద ప్రజల పట్టా భూములు,పరంపోకు భూములు,ఎన్నో ఏళ్లుగా అనుభవిస్తున్న భూములను చేర్చి ప్రజలను తీవ్ర మానసిక క్షోభకు గురిచేస్తోందని అన్నారు. చదువుకునే విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని,తులం బంగారం అందజేస్తామని,పింఛన్లను రెండు వేల నుంచి నాలుగు వేలకు పెంచుతామని చెప్పి ఇప్పుడు మొహం చాటేశారని,కేవలం ఉచిత బస్సు ప్రయాణం ఒక్కటే అమలు చేసి చేతులు దులుపుకుంటే సరిపోదని ఎద్దేవా చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు,మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ నాయకత్వ సూచనల ప్రకారం ప్రజా సమస్యలపై అధికారులకు వినతిపత్రం అందజేశామని,కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు బీఆర్ఎస్



పక్షాన ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తామని,లేనిపక్షంలో ప్రజలే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గొండ్రియల సర్పంచ్ కలకొండ లచ్చయ్య,నాయకులు పందిరి వీరయ్య యేసు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న ప్రభుత్వం

## - మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు

## - అసెంబ్లీ సంఘటన కు నిరసనగా భారీ నిరసన

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 07,(ప్రజాజ్యోతి):**

ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఖూనీ చేస్తుందని అసెంబ్లీకి వెళ్లకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అడ్డుకోవడం పోలీసులు వ్యవహరించిన అణచివేత ధోరణికి నిరసనగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం భారీ నిరసనకార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుండి భారీ ర్యాలీగా బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరికి నిరసనగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ బస్టాండ్ వద్ద కు చేరుకొని, బస్టాండ్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, పోలీసుల అణచివేత చర్యలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ రావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా తమ నిరసనను వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రాకుండా అడ్డుకోవడం, నాయకులపై పోలీసులతో అణచివేత చర్యలకు పాల్పడడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. ప్రతిపక్షాల గొంతును నొక్కడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు, ప్రతిపక్షాల హక్కులను పరిరక్షించేందుకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం మరింత ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తిప్పన విజయసింహ రెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎడవెల్లి శ్రీనివాస రెడ్డి, అన్నబీమోజు నాగార్జున చారి, ఎండి. ఇలియాస్ ఖాన్, ధనావత్ చిట్టిబాబు నాయక్,ఎండి. మగ్దుం పాషా, ఎండి. మాజీద్, పద్మశెట్టి కోటేశ్వర రావు, గంగుల బిక్షం, రావూరి సుధాకర్, చంద్రశేఖర రావు, రవి, దుర్గాప్రసాద్, మట్టపల్లి సైదులు యాదవ్, ఎండి. షోయబ్,యర్రమల్ల దినేష్, చౌగాని బిక్షం గౌడ్, పులి జగదీష్, వింజం శ్రీధర్, పెండ్యాల పద్మ,కోదాటి రమా, షహనాజ్ బేగం,పెరుమాళ్ళ ధనమ్మ, లలిత,పిన్న బోయిన శ్రీనివాస్ యాదవ్ పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# చిత్తడి నేలల సంరక్షణకు పటిష్ట చర్యలు

## - జిల్లాలో 302 చిత్తడి నేలల గ్రౌండ్ ట్రూతింగ్, సరిహద్దుల నిర్ధారణ పూర్తి చేయాలి

## - జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్






**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 07(ప్రజా జ్యోతి):**

జిల్లాలోని చిత్తడి నేలలను పరిరక్షించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.జిల్లాలో గుర్తించిన 302 చిత్తడి నేలల క్షేత్రస్థాయి పరిశీలన (గ్రౌండ్ ట్రూతింగ్), సరిహద్దుల నిర్ధారణ ప్రక్రియను సంబంధిత శాఖల సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సోమవారం జిల్లా చిత్తడి నేలల కమిటీ అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రతి చిత్తడి నేలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సరిహద్దులను నిర్ధారించాలని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చేపడుతున్న నోటిఫికేషన్ ప్రక్రియపై చర్చించారు.చిత్తడి నేలల నోటిఫికేషన్ ప్రక్రియను క్రమబద్ధీకరించి వేగవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్‌ను చైర్‌పర్సన్‌గా, జిల్లా అటవీ అధికారిని సభ్య కార్యదర్శిగా, సంబంధిత శాఖల అధికారులను సభ్యులుగా నియమిస్తూ జిల్లా స్థాయి చిత్తడి నేలల కమిటీలను ఏర్పాటు చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.శాటిలైట్ చిత్రాల ఆధారంగా గుర్తించిన చిత్తడి నేలల సరిహద్దులను క్షేత్రస్థాయిలో ధృవీకరించి నిర్ధారించడంతో పాటు,సంక్షిప్త పత్రం తయారు చేసి నోటిఫికేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలో గుర్తించిన 302 చిత్తడి నేలలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి సరిహద్దులను నిర్ధారించాలని ఆదేశించారు.చిత్తడి నేలలు ఎలాంటి ఆక్రమణలకు గురికాకుండా ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు.పులిచింతల రిజర్వాయర్,మూసీ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ పరిధిలోని చిత్తడి నేలలను కూడా గుర్తించి నోటిఫై చేసే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్వో ప్రేమ్ రాజ్, జిల్లా అటవీ అధికారి దామోదర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, డీఆర్డీఓ పీడీ సన్యాసయ్య, ఆర్డీవోలు వేణుమాధవ్, శ్రీనివాసులు, సూర్యనారాయణ, జిల్లా ఇరిగేషన్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోలీసుల దాష్టీకానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ భగ్గుమంటోంది!

## - ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కోదాడలో భారీ నిరసనధర్నా




## - బొల్లం మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో

## గాంధీ విగ్రహం వద్ద రేపు ఆందోళన

**కోదాడ, నడిగూడెం,సెప్టెంబర్ 7, ప్రజా జ్యోతి:**

తెలంగాణ అసెంబ్లీలో చోటుచేసుకున్న పరిణామాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మహిళా నాయకుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుకు నిరసనగా కోదాడలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసనధర్నా చేపట్టనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే విధంగా ప్రభుత్వం, పోలీసులు వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ చర్యలను నిరసిస్తూ కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 8న ఉదయం 11 గంటలకు కోదాడ బస్‌స్టాప్ సెంటర్‌లోని గాంధీ విగ్రహం వద్ద భారీ నిరసన, ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు, నియోజకవర్గ, మండల అధ్యక్షులు, కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, మాజీప్రస్తుత ప్రజాప్రతినిధులు, గ్రామవార్డు స్థాయి నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.

# కేశవ బోయిన పుల్లయ్య పాతిక దయానికి పూలమాలు వేసిన టిఆర్ఎస్ నాయకుడు

**రామన్నపేట సెప్టెంబరు ( ప్రజా జ్యోతి)**

రామన్నపేట పట్టణానికి కేశవ బోయిన వెంకటేశం టీచర్ తండ్రి రిటైర్డ్ ఉద్యోగి కేశవ బోయిన పుల్లయ్య పరమపదించారు పూలమాలలు వేసి వారి కుటుంబానికి పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం టిఆర్ఎస్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే చాంద్ తెలియజేశారు అనంతరం శివయాత్రలు పాల్గొన్నారు కార్యక్రమంలో కందుల నరసింహ, పెద్ద బోయిన మురళి ,కందుల హనుమంతు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు,



# ఘనంగా వనభోజన మహోత్సవం

**చింతలపాలెం, సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి):**

కాంగ్రెస్, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో సోమవారం వన భోజనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముత్యాలమ్మ పండుగ వేడుకల్లో భాగంగా కాంగ్రెస్, సీపీఐ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో వన భోజనాలకు తరలివెళ్లారు. మహిళలు సంప్రదాయ వంటకాలను సిద్ధం చేయగా, చిన్నారులు, యువత ఆటపాటలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రకృతి ఒడిలో అందరూ కలిసి భోజనం చేస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. ముత్యాలమ్మ తల్లి పండుగ సందర్భంగా నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణానికి కొనసాగింపుగా నిర్వహించిన వన భోజనాలు కాంగ్రెస్, సీపీఐ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజల మధ్య ఐక్యత, ఆత్మీయతను చాటిచెప్పాయి. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ పండుగ విశేషాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్తేల నారాయణరెడ్డి, వీరం రెడ్డి శ్రీనివాసరెడ్డి, వీరం రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, చింత్రియాల సురేందర్, చింత్రియాల రవి, షేక్ జియాలుద్దీన్, నరేందర్ రెడ్డి, అంబటి రాజశేఖర్ రెడ్డి తదితర నాయకులు, కాంగ్రెస్, సీపీఐ పార్టీల కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



# చిలకమర్రి, నీలం నగర్ పరిసర ప్రాంతాలలో చిరుతపులి సంచరిస్తున్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవం గుడిపల్లి సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి స్పష్టత

**గుడిపల్లి, సెప్టెంబర్ 07, (ప్రజా జ్యోతి) :**

చిలకమర్రి గ్రామ పంచాయతీ పరిధిలోని నీలం నగర్ మరియు చుట్టుపక్కల ప్రాంత ప్రజలకు, రైతులకు, పశువుల కాపరులకు గుడిపల్లి సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి ఒక ముఖ్యమైన ప్రకటన చేశారు. గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో నీలం నగర్ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తోందని, ఒక వ్యక్తి ఫోటో తీశాడని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని ఆయన స్పష్టం చేశారు.ఈ విషయమై సర్పంచ్ స్వయంగా స్పందిస్తూ క్రింది వివరాలను వెల్లడించారుఫేక్ ఫోటోగా గుర్తింపు: చిరుతపులి ఫోటో తీశానని చెప్పిన వ్యక్తి మొబైల్ ఫోన్‌ను స్వయంగా పరిశీలించగా, అది గూగుల్ యాప్ నుండి డౌన్లోడ్ చేసిన నకిలీ ఫోటో అని తేలింది. ప్రజలు ఎవరూ ఆ ఫోటోను నమ్మవద్దు.భౌగోళిక పరిస్థితులు మన ప్రాంతంలో చిరుతపులి దాక్కోవడానికి వీలుగా ఎలాంటి దట్టమైన పొదలు లేదా కంపచెట్లు లేవు. అంతా మైదాన ప్రాంతంగా ఉండటం వల్ల చిరుత వచ్చే అవకాశం లేదు. ఒకవేళ వచ్చినా వెంటనే ప్రజల కంటపడేది.అవగాహన కోసమే ఏఐ ఫోటోల ఎడిటింగ్ టెక్నాలజీ ఎఐ ద్వారా ఫోటోలను ఎంత సులువుగా సృష్టించవచ్చో మరియు మార్చవచ్చో ప్రజలకు ప్రాక్టికల్‌గా చూపించి, వారిలో ఉన్న భయాన్ని పోగొట్టడానికే నేను కొన్ని కృత్రిమ ఫోటోలను గ్రూపుల్లో షేర్ చేశాను. ఇది కేవలం అవగాహన కోసం చేసిన ప్రయత్నమే తప్ప ఎవరినీ తప్పుదోవ పట్టించడానికి కాదు.ఒక ప్రజాప్రతినిధిగా ప్రజల ప్రాణాలు, వారి పశు గ్రాసం మరియు క్షేమం నా బాధ్యత.







గ్రామ ప్రజలెవరూ ఇలాంటి అసత్య ప్రచారాలను, రూమర్లను నమ్మి భయభ్రాంతులకు గురికావద్దు. అందరూ ధైర్యంగా తమ వ్యవసాయ పనులను చేసుకోవచ్చు.

---

# ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

## - ఉచిత కంటిపొర శిబిరాన్ని ప్రారంభించిన

## - మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్







**దేవరకొండ, సెప్టెంబర్ 07, ( ప్రజా జ్యోతి) :**

పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించడం ఎంతో అభినందనీయమని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.సోమవారం నాడు దేవరకొండ మండలం పడమటిపల్లి గ్రామంలో పల్లా నర్సిరెడ్డి మెమోరియల్ సొసైటీ మరియు హైదరాబాద్‌కు చెందిన ప్రసిద్ధ శంకర నేత్రాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటిపొర క్యాటరాక్ట్ వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ... సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన పేద, మధ్యతరగతి ప్రజలకు కంటి సమస్యల నుండి ఉపశమనం కలిగించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతగానో



దోహదపడతాయన్నారు. అత్యాధునిక సాంకేతికతతో ఉచితంగా కంటి పరీక్షలు, అవసరమైన వారికి ఉచిత శస్త్రచికిత్సలు అందించేందుకు ముందుకు వచ్చిన పల్లా నర్సిరెడ్డి మెమోరియల్ సొసైటీ మరియు శంకర నేత్రాలయం ప్రతినిధులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు, శంకర నేత్రాలయం వైద్య బృందం,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్, పిఎసిఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్,స్థానిక సర్పంచ్ పల్లా శ్రీకాంత్ రెడ్డి,నాగవరం వెంకటేశ్వర్ రావు ,వెంకటయ్య,మాల్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, పల్లా వెంకట్ రెడ్డి, మాల్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కొమ్ము రామస్వామి,యాదయ్య,తదితరులు మరియు స్థానిక నాయకులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదల సొంతింటి కల సాకారం

## - లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం

## - నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

## మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 07(ప్రజా జ్యోతి):** ఇందిరమ్మ ఇళ్ల పథకంతో నిరుపేదల సొంతింటి కల సాకారం అవుతోందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సూర్యాపేట మండలం బాలెంల గ్రామానికి చెందిన పేరెల్లి సైదమ్మసైదులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి ప్రాధాన్యత



ఇస్తోందన్నారు. సూర్యాపేట నియోజకవర్గంలో మొదటి విడతలో దివంగత రామ్‌రెడ్డి దామోదర్‌రెడ్డి చొరవతో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, వాటిలో సుమారు 70 శాతం ఇళ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. రెండో విడతలో మరో 2,000 ఇళ్లను కేటాయించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తోందని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలు చేయడంతో పాటు, సన్న వడ్లు పండించిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. మహిళా సంఘాల ద్వారా బస్సులు కొనుగోలు చేయించి వారిని యజమానులుగా తీర్చిదిద్దే కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తుచేశారు. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలెంల మాజీ సర్పంచ్ రామసాని రమేష్, రామసాని శ్రీనివాస్,





రూపాని రమేష్, మామిడి ఉపేందర్, మామిడి సురేష్, మామిడి రేనయ్య, మామిడి సాయి, ఇందిరమ్మ కమిటీ సభ్యురాలు ఓవుట సైదమ్మ, మామిడి నగేష్, శ్రీకాంత్, విజయ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ అబ్దుల్ కరీం, జిల్లా కాంగ్రెస్ నాయకులు పందిరి మల్లేష్, రాపర్తి నాగరాజు, షేక్ రహీం, అనంతుల నవీన్, రావుల రమేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

---



# నూతన గృహ ప్రవేశ వేడుకకు ఎమ్మెల్యే వేముల వీరేశం



**నార్కట్ పల్లి, సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి):** నార్కెట్‌పల్లి మండలం ఎం.యోడవెల్లి గ్రామానికి చెందిన పాశం గోపాల్‌రెడ్డి నూతన గృహ ప్రవేశ కార్యక్రమం హైదరాబాద్‌లోని జీడిమెట్లలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరై గోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులను అభినందించి, నూతన గృహంలో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు పాల్గొన్నారు.